

ప్రజా ఉద్యమం రావాలి
భూ హక్కుల కోసం ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి అన్నారు.
- 8లో



నిరవధిక సమ్మెలో వీఓఏలు
తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండు రోజులుగా కొనసాగుతోంది.
- 10లో

గరిష్టం/కనిష్టం
44° / 25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

వచ్చే నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అనాథ వసతి గృహాలు, ఇతర స్వచ్ఛంద సంస్థల్లో ఉంటూ పదో తరగతి పూర్తి చేసిన అనాథ బాలికలకు ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి వచ్చే నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని జ్యోతి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత దరఖాస్తు తో పాటు కులం, ఆదాయ ధ్రువీకరణ, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్లను జతచేయాలని పేర్కొన్నారు.మరింత సమాచారానికి బాలరక్ష భవన్, మహిళా శిశు సంక్షేమ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలో ఈ నెల 24, 25న నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో న్యూ డెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగం సంక్షోభానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. రైతులు వ్యవసాయాన్ని వదులుకొని ఇతర రంగాల వైపు వెళ్లిపోతున్నారని, గిట్టుబాటు ధరలు వచ్చే పరిస్థితి లేదన్నారు. బీమా సౌకర్యం కల్పించని కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రైతాంగ ఉద్యమాలను మరింతగా పదును పెట్టించడానికి కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కు మార్, ఉపాధ్యక్షుడు బజ్జూరి వెంకట్రాంరెడ్డి, కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యం కాంటా వేయాలి

కోదాడరూరల్: కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వెంటనే కాంటా వేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీరాములు అన్నారు. మంగళవారం కోదాడ మండల పరిధిలోని చిమిర్యాలలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించినా.. నేటి వరకు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలకు మిల్లులను కేటాయించి కాంటాలు వేసి తరలించే విధంగా చూడాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట మల్లేపల్లి లక్ష్మణ్‌రావు, వంకాయలపాటి నర్సయ్య, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు, రమేష్ ఉన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ఎదుర్కోళ్ల మహోత్సవం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం మహానివేదనతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు పాల్గొన్నారు.

దారులన్నీ ధాన్యం మయం



జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల నూతనంగా నిర్మించిన సూర్యాపేట - ఖమ్మం హైవే సర్వీస్ రోడ్లపై సూర్యాపేట, చివ్వెంల మండలాల పరిధిలోని రైతులు తమ ధాన్యాన్ని ఇలా కుప్పలుగా పోసి ఆరబెడుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

అన్ని మార్గాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దు కలిగిన అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. చెక్‌పోస్టుల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం డీజీపీ అంజనీకుమార్ జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ నిబంధన మేరకు ప్రణాళిక ప్రకారం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారుల సమన్వయంతో ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ అండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ

సీసీ కెమెరాల ఆవశ్యకతను గుర్తించాలి
హుజూర్‌నగర్: సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో దాతల సహకారంతో రూ.7.50 లక్షలతో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన 40 సీసీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు, అనైతిక చర్యలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు ఆవశ్యకత ఉందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించిన రైస్ మిల్లర్స్, మెడికల్ అసోసియేషన్, గోల్డ్, కిరాణా వ్యాపారుల అసోసియేషన్, ప్రజాప్రతినిధులను ఎస్పీ అభినందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

‘సిండికేట్’ గండం!

- దళారుల సిండికేట్‌తో అమాంతం తగ్గిపోయిన మామిడి ధరలు
- టన్నుకు రూ.50వేలు ఉండగా ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.30వేల లోపే
- సుమారు 11వేల ఎకరాల్లో మామిడి సాగు
- నష్టపోతున్న రైతులు

సూర్యాపేట: మామిడి రైతుకు ఈ సీజన్ చేదునే మిగిల్చింది. ఏటా నష్టపోతున్న తమకు ఈ ఏడాదైనా లాభాలు తెచ్చి పెడుతుందన్న రైతుల ఆశ ప్రతికూల వాతావరణంతో అడియాశగానే మారింది. ఈదురు గాలులకు పిందెలు, కాయలు రాలిపోతుండగా కురిసిన వర్షాల కారణంగా మంగు తెగులు సోకి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో ఆకాశాన్ని అంటాల్సిన ధరలు పాతాళానికి పడిపోయాయి. దీనికి తోడు దళారుల సిండికేట్‌తో ధరలు అమాంతం తగ్గిపోయాయి. ఈ అవకాశాన్ని దళారులు తమకు అనుకూలంగా మార్చుకొని సిండికేట్‌గా ఏర్పడి మామిడి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కొనుగోలు కేంద్రంలో మామిడి కాయలు

స్థానికేతరులదే హవా..
ఖమ్మం, నల్లగొండ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాతో పాటు నూజివీడు నుంచి మామిడి భారీగా మార్కెట్‌కు వస్తోంది. జాతీయ రహదారిపై ఉండి ఇతర రాష్ట్రాలకు తక్కువ సమయంలో రవాణా చేయకలిగే అవకాశం ఉండటంతో సూర్యాపేట మామిడి మార్కెట్‌కు అడ్డాగా మారింది. అయితే స్థానికంగా ప్రభుత్వ మార్కెట్ లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన వ్యాపారులు మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. సూర్యాపేటలో పదుల సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఉండగా అందురూ స్థానికేతరులతో కమీషన్ ఏజెంట్‌లుగా కొనసాగుతున్నారు. ఇక్కడకు పూణే, చెన్నై, ఢిల్లీ, బెంగుళూరు, గుజరాత్, ఆగ్రాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. కమీషన్ ఏజెంట్లు, కొనుగోలు దారులు ఏకమై రైతులకు తక్కువ ధరలను చెల్లిస్తూ మోసం చేస్తున్నారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షాలతో తీరని నష్టం
జిల్లాలో సుమారు 11వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో దాదాపు 3వేల ఎకరాల మామిడి నేలరాలి తీవ్ర నష్టం ఏర్పడింది. తొలి విడతగా వచ్చిన మామిడిపూత జనవరిలో పిందెగా మారడంతో ఈ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆనందపడ్డారు. అయితే ఈదురు గాలులు, వర్షాలకు పిందె రాలిపోయింది. కొద్దిరోజులకు తిరిగి పూత రావడంతో పంట నాణ్యత కాపాడేందుకు 10 నుంచి 14 సార్లు పురుగు మందులు పిచికారీ చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయినా వర్షాల రూపంలో దురదృష్టం వెంటాడడంతో మామిడికాయలు రాలడంతో పాటు... మంగు తెగులు సోకి కాయల నాణ్యత పడిపోయి, తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

దళారులు నిర్ణయించిందే ధర..
పంట చేతికొచ్చే సమయానికి మామిడి నేల రాలడం, దీనికి తోడు ధర అమాంతం పడిపోవడంతో రైతులకు తీవ్రనష్టం తప్పడం లేదు. మార్కెట్లో బంగినపల్లి రకం మామిడి కాయలకు టన్ను ధర రూ.50వేలు ఉండగా ప్రస్తుతం దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధరను ఏకంగా రూ.8 వేల నుంచి రూ.30వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. రసాలు టన్నుకు రూ. 11వేల నుంచి రూ. 28 వేలకు మించడం లేదు. ఎక్కువ మొత్తంలో కాయలను తక్కువ ధరకు కొని.. తక్కువ మొత్తంలో కాస్త ఎక్కువ ధర చూపిస్తూ దానినే ప్రచారం చేసుకుంటున్నారు. కాగా.. జిల్లా కేంద్రానికి ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నుల మామిడి వస్తోంది.

యాదాద్రికి మెడికల్ కళాశాల !



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే కూసుకుంట్ల తదితరులు

- వచ్చే ఏడాది మంజూరు చేస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటన
- క్యాన్సర్ బాధితులకు త్వరలో జిల్లాల్లోనే కీమో థెరపీ సేవలు
- మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

చౌటుప్పల్ : వచ్చే ఏడాది యాదాద్రి జిల్లాకు నూతనంగా మెడికల్ కళాశాలను మంజూరు చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రకటించారు. చౌటుప్పల్‌లో నిర్మించనున్న 100పడకల ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వైద్య రంగానికి సంబంధించి 13వందల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే ఈ సేవలన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. భువనగిరి -400, చౌటుప్పల్ -100, యాదగిరిగుట్ట -100, నకిరేకల్-100, తుంగతుర్తి -100, ఆలియా -30, మర్రిగూడ-30, నల్లగొండ -50(ఐసీయూ), నాగార్జునసాగర్‌కు ఏరియా ఆస్పత్రి మంజూరు చేసుకున్నామన్నారు. బీబీనగర్, వలిగొండ పీహెచ్‌సీ భవనాలకు రూ.1.60కోట్ల చొప్పున, తంగడపల్లి పీహెచ్‌సీ భవనానికి రూ.90లక్షలు మంజూరు చేశామన్నారు. యాదాద్రి జిల్లాలోని ఒక్కో ఏఎన్‌ఎం సబ్‌సెంటర్‌కు రూ.20లక్షల చొప్పున కేటాయించగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నల్లగొండ జిల్లాపై సీఎం కేసీఆర్‌కు ఎంతో ప్రేమ ఉందన్నారు.



చౌటుప్పల్‌లో ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో నాలుగు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే అందులో రెండు ఉమ్మడి జిల్లాకే మంజూరు చేశారని గుర్తుచేశారు. నల్లగొండ, సూర్యాపేటకు నర్సింగ్ పారామెడికల్ కళాశాలలతో పాటు పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్లను అందుబాటులోకి తెస్తామన్నారు. అదే విధంగా త్వరలోనే రెండు జిల్లాల్లో రేడియాలజీ సెంటర్‌లు ప్రారంభం కానున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33జిల్లాల్లో క్యాన్సర్ బాధితుల కోసం కీమో థెరపీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి హైదరాబాద్‌కు వెళ్లే బాధల నుంచి విముక్తి కల్పిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌ను దేశమంతా విస్తరిస్తాం
నాడు సిద్దిపేటలో టీఆర్‌ఎస్ పార్టీకి తొలి విజయం లభించగా, బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత మునుగోడు నుంచి లభించిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉప ఎన్నిక గెలుపు స్ఫూర్తితో దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ను విస్తరిస్తామన్నారు. రాష్ట్రాన్ని 40ఏళ్లు ఏలిన కాంగ్రెస్ హయాంలో జరగని అభివృద్ధి బీఆర్‌ఎస్ పాలనతో సాధ్యమయ్యిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ పమేలాసత్పతి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మంచుకొండలా..



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని కొంత మంది చెబుతున్నారని, కానీ ఆ పార్టీ నేడు మంచుకొండలా కరిగిపోతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఇదే సమయంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో వేదిక మీద మైకు లాక్కున వ్యక్తికి ఇప్పుడు ఎక్కడా మైకే లేకుండా పోయిందని రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. అహంకారం ఎక్కువైన భూస్వాములనే ఎదిరించిన గడ్డ నల్లగొండ జిల్లా అని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో 12అసెంబ్లీ స్థానాలను ఒకే పార్టీ సాధించడం చరిత్ర అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలితం ఉమ్మడి జిల్లాకే దక్కుతుందన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు, ధైర్యం కేవలం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు మాత్రమే ఉందని తెలిపారు. నిజాలు మాట్లాడితే ఉలిక్కిపడుతున్న నరేంద్రమోదీ, అమిత్‌షాలు బెదిరింపులకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. వారికి బీఆర్‌ఎస్ భయపడబోదన్నారు.

ప్రజలకు శాపంలా మోదీ పాలన

- భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజారుద్దీన్

మఠంపల్లి : దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన ప్రజలకు శాపంలా మారిందని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ ఆరోపించారు. రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం మఠంపల్లి మండల పరిధిలోని రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ నదీమ్ జావెద్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని అలాంటి పార్టీలకు దేశవ్యాప్తంగా చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ భావాలు గలదని, అన్ని కులాలు, మతాలకు అనుకూలమైన పార్టీ అని పేర్కొన్నారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో చివరి భూముల రైతులకు నీటి సౌకర్యం కల్పించడంతో పాటు ప్రజలకు ఎనలేని సేవ చేసింది ఉత్తమ్ మాత్రమేనన్నారు. నీళ్లు, ఇతర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఒక కెప్టెన్‌లా ప్రజల కోసం నిరంతరం తపించే నాయకుడు మీకు ఉండటం ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. నదీమ్ జావెద్ మాట్లాడుతూ ఉత్తమ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పని చేశారని, తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికాంలోకి రావాలని కోరుకుంటున్నామని అధికారంలోకి వస్తే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నామన్నారు. ప్రజలు తమ సహకారం అందించి ఉత్తమ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు ఎన్నో ఇళ్లు కట్టించామని, రఘునాథపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తాను మంజూరు చేసిందేనన్నారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సుఖసంతోషాలతో జీవించాలని అల్లాని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ. నిజాముద్దీన్, షేక్ సైదా, పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, తన్నీరు మల్లికార్జున్, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టి రామచందర్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, పలువురు ముస్లింలు మతపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజారుద్దీన్, చిత్రంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

తాగునీటి సమస్యను రానివ్వం

చిలుకూరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ తెలిపారు. మంగళవారం చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో నర్సరీ, పల్లెప్రకృతి వనాన్ని ఆయన సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండల పరిషత్ రికార్డుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్, సర్పంచ్ రవీందర్, గ్రామ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ సురేష్

ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం దుర్మార్గం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై సీఎం కేసీఆర్ స్పందించకుండా.. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మద్దతు ధరకు అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గతంలో ఎన్నికలకు ముందు పోడు భూములకు పట్టాలు ఇస్తానని చెప్పిన కేసీఆర్, నేడు అవే భూములను మంత్రులు, ఎమ్మెల్యేలు కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, మల్లెపాక సాయిబాబా, అక్కిరాజు యశ్వంత్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు చల్లమల్ల నరసింహ, గజ్జల వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బంగారు శృతి

భూదానోద్యమ స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శం

భూదాన్‌పోచంపల్లి: భూదానోద్యమ స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని వినోబాభావే డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, గాంధీ గ్లోబల్‌ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో 72వ భూదానోద్యమ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భూదానోద్యమ పిత ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డిల కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

‘డిజిటల్’పై అవగాహన కల్పించేలా..

- పొదుపు సంఘాల మహిళలకు ప్రత్యేక కార్యక్రమం
- మొబైల్ ఫోన్ ద్వారా రుణ చెల్లింపులు జరిపేలా..
- మెళకువలు నేర్పించాలని ప్రభుత్వం నిర్ణయం
- జిల్లా వ్యాప్తంగా 26 గ్రామాల ఎంపిక

నాగారం: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నా.. సాంకేతిక పరిజ్ఞానం సాధించలేకపోతున్నారు. ప్రతి సమావేశంలో సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పిస్తున్నా మహిళలు దాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. పొదుపు తాలూకు సొమ్ము లేదా రుణ వాయిదాల సొమ్మును నమ్మినవారికి చెల్లించి తమ ఖాతాల్లో జమ చేయాలని కోరడం.. వారు సకాలంలో చేయకపోవడంతో మహిళలు మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాల మహిళలు స్వయంగా డిజిటల్ చెల్లింపులు చేసుకునేలా అవగాహన కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

సిద్ధమైన కార్యాచరణ..
జిల్లాను యూనిట్‌గా తీసుకొని ప్రతి మండలం నుంచి ఒకటి, రెండు గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు సంపూర్ణ సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. మహిళలకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక కార్యక్రమం అమలుకు అధికారులు సైతం సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లాలో 26 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలతో తరుచూ సమావేశాలు నిర్వహించి సెల్‌ఫోన్ ద్వారా పొదుపు సొమ్ము, రుణ వాయిదాల సొమ్ము చెల్లించే విధానాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించనున్నారు.

సైబర్ నేరాలను నివారించేలా..
నిరక్షరాస్యులైన మహిళల నుంచి కొందరు రుణ వాయిదాలను సేకరించి వారి ఖాతాల్లో జమ చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసగాళ్లు, ఇలాంటి అమాయక మహిళలను మోసం చేస్తుంటారని అధికారులు గుర్తించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని మహిళా సంఘాల సభ్యులకు రుణ వాయిదాలు చెల్లించడం, పాస్‌వర్డ్ ఏర్పాటు, ఇతరులకు పాస్‌వర్డ్‌ను వెల్లడించకపోవడం తదితర విషయాలను వివరిస్తారు. ఎరువూ గుర్తించకుండా పాస్‌వర్డ్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలో సూచిస్తారు. తద్వారా సైబర్ నేరాలకు అడ్డకట్ట వేయనున్నారు.



నాగారంలో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

జిల్లాలో మండలాల సంఖ్య	23
మహిళా పొదుపు సంఘాలు	13,820
మొత్తం సభ్యులు	1,43,510

త్వరలోనే శిక్షణ ప్రారంభిస్తాం..



“జిల్లాలో అర్హతలు కలిగిన 26 గ్రామాలను ఎంపిక చేశాం. ఆయా గ్రామల్లోని పొదుపు సంఘాల మహిళలకు మొదట అవగాహన తరగతులు నిర్వహిస్తాం. ఆర్థిక వ్యవహారాల్లో చురుకుగా ఉన్న మహిళలకు మొబైల్‌ఫోన్ ద్వారా నగదు బదిలీ చేసే విషయంలో మెళకువలు నేర్పిస్తాం. తమ సమయం వృథాకాకుండా ఇంటి నుంచే జమలు, చెల్లింపులు చేసుకునేలా అవగాహన కల్పిస్తాం.
– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను గురువారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అధికారిణి కె. అనిత ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు అదే రోజు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఆలేటి శ్రీనివాస్‌రావు

చిలుకూరు: ఇంటి ముందు కిందపడడంతో తలకు తీవ్రగాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆలేటి శ్రీనివాస్‌రావు (46) సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్తుండగా ఇంటి ముందు ఉన్న రాయి తగిలి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

నూతనకల్: బైక్ ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. నూతనకల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దాచేపల్లి అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోరెంట్ల ఎల్లమ్మ స్థానిక చర్చి సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద నుంచి తాగునీటిని తీసుకెళ్తున్న క్రమంలో మండల కేంద్రం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బైక్ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ అరవింద్ తెలిపారు.

వడదెబ్బతో హమాలీ మృతి

మాడ్గులపల్లి: వడదెబ్బతో హమాలీ మృతిచెందిన ఘటన మాడ్గులపల్లి మండలంలోని పీత్యా తండాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పీత్యా తండాకు చెందిన రమావత్ జాన్(67) ఇదే మండలంలోని దేవతలబావితండాలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా హమాలీ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం హమాలీ పనికి వెళ్లిన జాన్ ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన తోటి హమాలీలు జాన్‌ను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జాన్ మృతదేహాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కరరావు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుంగతుర్తి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన తుంగతుర్తిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వెలుగు అంజయ్య(65) ఆదివారం ఇంటి నుంచి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి తిరిగి రాలేదు. కాగా మంగళవారం రాత్రి తుంగతుర్తి శివారులోని బండరామారం స్టేజీ వద్ద ఉన్న అతడి వ్యవసాయ క్షేత్రంలోని మామిడి తోటలో విగతజీవిగా కన్పించాడు. భూతగాదాలు కారణంగానే అంజయ్యను ఎవరో చంపి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌ఐ డానియేల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఒక కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

భూ హక్కుల కోసం ప్రజాఉద్యమం రావాలి

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి


మాట్లాడుతున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి


ర్యాలీ నిర్వహిస్తున్న భూహక్కుల ఉద్యమకారులు

భూదాన్‌పోచంపల్లి: ఆచార్య వినోబాభావే ఉద్యమ స్ఫూర్తితో భూ హక్కుల కోసం ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి. నిరూప్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో భూదానోద్యమ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన భూహక్కుల ఉద్యమకారుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూహక్కులకు భద్రత కల్పించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో తీవ్ర అశాంతి నెలకొందన్నారు. తెలంగాణలో రెవెన్యూ చట్టాలు నిర్వీర్యం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను నేడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కొంటోందని విమర్శించారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణలో ఏ ప్రాజెక్ట్ కట్టినా, ఏ పరిశ్రమ నెలకొల్పినా దళితులు, పేదల భూములు లాక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఆదివాసీలు నిరాశ్రయులు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూహక్కుల ఉద్యమకారుడు, ప్రముఖ న్యాయవాది మేకా సునీల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే భూముల సర్వే జరగాలని అన్నారు. అలాగే ఒకే పట్టా, ఒకే చట్టం తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు దేశాయి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు, విద్య, వైద్యం, ఆదివాసులు, నిర్వాసితులు, దళితులు, వారి హక్కులపై మేనిఫెస్టోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆచార్య వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూదానం జరిగిన జువ్వి చెట్టునుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడకు చెందిన ఒగ్గు కళాకారులు మహిపాల్, బుగ్గయ్య బృందం నిర్వహించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ నోముల గణేశ్, ఏలే భిక్షపతి, చింతకింది రమేశ్, అంజమ్మ, వేశాల మురళి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం


జగదీష్ మృతదేహం

తుంగతుర్తి: డీసీఎం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కేశవాపురంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం నరసింహసాగరి గ్రామానికి చెందిన ఉప్పుల జగదీష్(24) గత మూడేళ్లుగా స్నేహా పౌల్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తొర్రూర్, తిరుమలగిరి బ్రాంచ్‌లలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా జగదీష్ సోమవారం మరో ముగ్గురు సూపర్‌వైజర్లతో కలిసి హైదరాబాద్ నుంచి కోడి పిల్లలను డీసీఎంలో లోడ్ చేసుకొని రాత్రి 10గంటల సమయంలో కేశవాపురం గ్రామం వద్ద ఉన్న కోళ్ల ఫారం వద్దకు వచ్చారు. ఈ క్రమంలో జగదీష్ డీసీఎం వెనక నిలబడి ఉండగా, డ్రైవర్ అజాగ్రత్తగా డీసీఎంను రివర్స్ తీయడంతో జగదీష్‌కు డీసీఎం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న మరో ముగ్గురు సూపర్‌వైజర్లు జగదీష్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడు అవివాహితుడు కాగా మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఉప్పుల ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డానియేల్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


వంగాల కృష్ణచారి

మిర్యాలగూడ అర్బన్: మందులు తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. టూ టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో నివాసముంటున్న వంగాల కృష్ణచారి(వీకే చారి) ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం మందులు తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9014555290 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మాడుగులపల్లి: మండలంలో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు మెరుపు దాడి చేశారు. మండలంలోని కుక్కడం గ్రామపంచాయతీ చివరన చెరువు కట్ట కింద చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ కైకూరి నగేష్, తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి కుక్కడం గ్రామానికి చెందిన నలుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నగేష్ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఉరేసుకొని ఇద్దరు ఆత్మహత్య


అంజయ్య మృతదేహం

నూతనకల్: అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పొదిల అంజయ్య (36) గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం రూ.10లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన అంజయ్య సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం అంజయ్య తన వ్యవసాయ భూమిలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఉప్పలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించినట్లు నూతనకల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దాచేపల్లి అరవింద్ తెలిపారు.

మద్యం మత్తులో..

హుజూర్‌నగర్: మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన మారం పవన్ రెండేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం భార్య జ్యోతి, కొడుకు, కుమార్తెతో కలిసి హుజూర్‌నగర్ వలస వచ్చాడు. స్థానిక లింగగిరి రోడ్డులో కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను మద్యానికి బానిసై అప్పులు చేసి తరచూ భార్య జ్యోతితో గొడవ పడేవాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. నాలుగు రోజుల క్రితం ఇక మద్యం తాగను అని చెప్పి ఆమెను తిరిగి హుజూర్‌నగర్‌లోని తన ఇంటికి తీసుకొని వచ్చాడు. కానీ అతను తన ప్రవర్తన మార్చుకోలేదు. సోమవారం మరోసారి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కాగా మంగళవారం ఉదయం మందుల బజార్ శివారులోని కాల్వ పక్కన చెట్టుకు పవన్ ఉరి వేసుకొని కపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చాలి



ధర్నా చేస్తున్న గూడూరు నారాయణరెడ్డి, రైతులు

- బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నారాయణరెడ్డి, రైతులు

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ వెంటనే మార్చాలని బీజేపీ సీనియర్ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ చేస్తూ హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై రాయగిరి వద్ద బాధిత రైతులతో కలిసి మంగళవారం ఆయన రాస్తారోకో చేపట్టగా పోలీసులు అరెస్ట్ చేసి భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే, గూడూరు అరెస్టును నిరసిస్తూ రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు గూడూరు నారాయణరెడ్డిని విడిచిపెటడంతో ఆయన కలెక్టర్ కార్యాలయానికి వచ్చి బాధిత రైతులతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలిగొండ మండలాల్లోని రాయగిరి, తుక్కాపురం, గౌస్‌నగర్, ఎర్రంబెల్లి, ప్రొద్దుటూరు, గోకారం, వర్కట్‌పల్లి గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చౌటుప్పల్ మోటకొండూరు, రాజాపేట తదితర గ్రామాల్లో అలైన్‌మెంట్ మార్చి బడా కార్పొరేట్, ప్రజాప్రతినిధులు, రియల్టర్లను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు చేస్తున్న ధర్నాకు టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కర్నాకర్‌గౌడ్, వెంకటయ్య, పాండు, వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, అనిల్, హన్మంతురెడ్డి, అర్జున్‌రెడ్డి, మల్లేష్, రామకృష్ణ, అయిలయ్య పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఇచ్చే గ్రూప్-4 ఉచిత కోచింగ్‌కు జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి గోశిక బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 27వ తేదీలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు 94943 45471, 79811 96060 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

దత్తత బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

- సినీ నటులు, టీచ్ ఫర్ చేంజ్ సంస్థ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి, మనోజ్


సినీ నటులు మంచు లక్ష్మి, మనోజ్‌తో కలెక్టర్ పమేలా సత్పతి, ఉపాధ్యాయులు

భువనగిరి: యాదాద్రి జిల్లాలో గతేడాది మన ఊరు -మన బడి కింద తాము దత్తత తీసుకున్న 56పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సినీ నటులు, టీచ్ ఫర్ చేంజ్ సంస్థ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి, మంచు మనోజ్ కలెక్టర్ పమేలా సత్పతిని కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి తాము దత్తత తీసుకున్న పాఠశాలల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం ఉన్న 56 పాఠశాలలతో పాటు మరికొన్ని పాఠశాలలను దత్తత తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 2022లో భువనగిరి మండలం వడపర్తి, రామన్నపేట మండలం సిరిపురం గ్రామాల్లో దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్, డిజిటల్ పాఠాలను ఉపాధ్యాయుల ద్వారా బోధిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు నిర్వహించిన అంత్య పరీక్ష ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సెక్టోరియల్ అధికారి అండాలు, ధరణి ఉన్నారు.

టీచ్ ఫర్ చేంజ్ సంస్థ సేవలు అభినందనీయం

యాదగిరిగుట్ట: టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ద్వారా సినీ నటి మంచు లక్ష్మి విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆమె సోదరుడు, సినీ హీరో మంచు మనోజ్ అన్నారు. సోమవారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని మంచు లక్ష్మి, మంచు మనోజ్‌తో పాటు ఆయన సతీమణి మౌనిక దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో లక్షలాది మంది విద్యార్థులకు టీచ్ ఫర్ చేంజ్ ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో చదువు అందించాలని యాదాద్రీశుడిని మొక్కినట్లు తెలిపారు. పెళ్లైన తర్వాత తొలిసారి యాదాద్రీశుడిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ.. తన సోదరుడు మంచు మనోజ్, మౌనికల వివాహం జరిగితే లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఇప్పుడు ఆ మొక్కు చెల్లించుకున్నట్లు వెల్లడించారు. టీచ్ ఫర్ ఛేంజ్ ఎన్‌జీఓలో భాగంగా ఈ సంవత్సరం చేసిన వర్క్, వచ్చే సంవత్సరం చేసిన వర్క్‌పై కలెక్టర్ పమేలా సత్పతితో చర్చించి, రిపోర్టు అందజేశామన్నారు.

నదీజలాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం


నాగార్జునసాగర్‌లో ఎన్‌ఎస్‌పీ అధికారులతో చర్చిస్తున్న కేఆర్‌ఎంబీ బృందం సభ్యులు

నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో మాట్లాడి నదీ జలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్ శివానందన్ కుమార్ అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లి మండల సమీపంలో కృష్ణానదిపై గల టెయిల్‌పాండ్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. నీటి వాడకంతో పాటు డ్యాం అధి కారులతో సమావేశమై సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు నాగార్జునసాగర్ ప్రాజె క్టు పరిధిలోని టెలిమెట్రీ కేంద్రాలను, కుడి కాలువను సందర్శించారు. డైవర్షన్ టన్నెల్‌పై ఏర్పాటు చేసిన టెలిమెట్రీ కేంద్రం నుంచి ఎంతమేరకు నీరు విడుదలవుతుందో పరిశీలించారు. ఆయన వెంట బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌గుప్తా, ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఈఈ శంకర్, వెంకటరమణ, శ్రీకాంత్, నాగరాజు తదితరులున్నారు.

స్వార్థపూరిత వ్యక్తులతో చరిత్ర వక్రీకరణ


మాట్లాడుతున్న లింగం సుధాకర్‌రెడ్డి

భువనగిరి: స్వార్థపూరితమైన వ్యక్తుల వల్ల దేశ, రాష్ట్ర చరిత్ర వక్రీకరించబడిందని విద్యా భారతి దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని దివ్య ఫంక్షన్‌హాల్‌లో నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠిత వ్యక్తుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాలకు వాస్తవ చరిత్రను అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. నైజాం కాలంలో హిందువులు, మహిళలపై జరిగిన అకృత్యాలను పాఠ్యాంశాల ద్వారా తెలియజేయాలన్నారు. వక్రీకరించిన చరిత్రను తిరిగి రాసేవరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు ఆత్మకూర్ మండలానికి చెందిన బత్తిని యాదగిరి, రాజాపేట మండలనికి చెందిన ఎడ్ల సత్యనారాయణను రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్ చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కూర్మెళ్ల విఠలాచార్య, గుండ్ల నాగరాజు, మాధవరెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, నాగభూషణం, సోమ నర్సయ్య, రమేష్, తపస్ అధ్యక్షుడు ఉమా, బండారు జయశ్రీ, ఉద్యోగ, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు


అల్కేష్‌కుమార్ శర్మకు ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయ స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీ పుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివా లయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు. వివిధ పూజలతో స్వామి వారికి నిత్య ఆదాయం రూ.14,02,588 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

స్వామిని దర్శించుకున్న అల్కేష్‌కుమార్ శర్మ

యాదాద్రీశుడిని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అలేక్షకుమార్ శర్మ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారి లడ్డూ ప్రసాదం అందజేశారు.

అన్న ప్రసాదానికి క్యూ కట్టిన భక్తులు

యాదాద్రిలో అన్న ప్రసాదం కోసం మంగళవారం భక్తులు క్యూ కట్టారు. స్వామిని దర్శించుకున్న భక్తులతో పాటు కల్యాణం చేయించిన భక్తులు అధిక సంఖ్యలో కొండ కింద గల గండి చెరువు సమీపంలో నిర్మించిన తాత్కాలిక అన్నదాన భవనానికి ఉదయం 11.30గంటలకు చేరుకున్నారు. అప్పటికి అన్న ప్రసాదం భక్తులకు పంపిణీ చేయడం ప్రారంభించలేదు. దీంతో భక్తులు ఒక్కసారిగా తరలిరావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్న ప్రసాదం కోసం వందలాది భక్తులు క్యూ కట్టి మండుటెండకు ఇబ్బందులు పడ్డారు. ప్రతి రోజు 600లకు పైగా టిక్కెట్లను భక్తులకు అన్న ప్రసాదం కోసం అధికారులు ఇస్తున్నారు. వీరంతా టిక్కెట్లు తీసుకోని క్యూలైన్‌లో సుమారు గంట పాటు వేచి చూడాల్సి వచ్చింది. అన్నప్రసాదం అందజేయడం లేదంటూ అక్కడ ఉన్న సంబంధిత సిబ్బంది, అధికారులతో భక్తులు వాగ్వాదానికి దిగారు. కొద్ది సేపటికే భక్తులకు అధికారులు అన్నప్రసాదం పంపిణీ చేశారు. 11.30గంటలకు వచ్చిన భక్తులకు మధ్యాహ్నం 12.30గంటలకు అన్న ప్రసాదం అందించారు.

క్షేత్రస్థాయిలో రైతుల అనుభవాలు తెలుసుకోవాలి




కూరగాయల సాగులో మల్చింగ్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

త్రిపురారం: వ్యవసాయ కోర్సు చదివే విద్యార్థులు క్షేత్రస్థాయిలో రైతుల అనుభవాలను అధ్యయనం చేయాలని హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం కౌన్సిల్ సభ్యుడు సుబ్బారెడ్డి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి, పాలెం వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకుడు మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రంలో రాజేంద్రనగర్, పాలెం వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా వివిధ పంటల్లో రైతులు అవలంబించాల్సిన పద్ధతులపై జిల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వ్యవసాయ స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడానికి రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రైతులు మట్టి పరీక్షల ద్వారా భూసారం ఎలా ఉందో తెలుసుకొని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పుష్పవతి, డాక్టర్ లింగయ్య, డాక్టర్ సురేష్, రవీంద్రనాయక్, చంద్రశేఖర్, పల్లవి, రాములమ్మ, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు గుర్తించాం



గత నాలుగు నెలలుగా క్షేత్రస్థాయిలో రైతులు వ్యవసాయంలో అవలంబిస్తున్న సాగు పద్ధతులను పరిశీలించాం. రైతుల అనుభవాలను అవగాహన చేసుకున్నాం. కళాశాల చదువులతో పాటు రైతుల అనుభవాలను స్వీకరించి రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాం. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాం.

– చంద్రశేఖర్, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థి

ప్రకృతి వ్యవసాయం చేయాలి



రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాం. కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ వైపు దృష్టిసారించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాం.

– వెంకటేష్, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థి